
# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# THE WORD OF TRUTH



NOVEMBER 1994

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

(క్రీస్తు సంఘం)

## ఆ హ్వా న ము

## గొప్ప బైబిల్ సెమినార్

ఉపన్యాసకులు : పెర్రి బి. కాతమ్, **U.S.A**

జాన్ ఫోర్డ్, **U.S.A**

నేన్సి ఫోర్డ్, **U.S.A**

(స్త్రీలకు ప్రత్యేక తరగతులు)

తేదీలు : **1994** డిశంబరు **12** సోమవారం నుండి **17**వ తేదీ శనివారం మధ్యాహ్నం వరకు

సమయం : ప్రతిరోజు ఉదయం **10** గం॥లకు మధ్యాహ్నం **3** గం॥లకు సాయంకాలం **6–30** గం॥లకు

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణ విద్యుత్ నగర్, కాకినాడ-533 003

గొప్ప పునరుద్ధరణ ఉద్యమము :- వేల కొలది ప్రజలు ప్రతి సంవత్సరం హాజరగుచున్నారు - ఇండియా లోని 11 రాష్ట్రాల నుండి ప్రజలు తరలి వచ్చుచున్నారు. హాజరగుతున్నారు. గొప్ప వర్తమానములు అందించబడు చున్నవి. వందలకొలది సువార్తకు లోబడుచున్నారు. గొప్ప ఆత్మీయ విందు మరియు సహవాసము - ఆత్మలు బలపడు చున్నవి - సంఘములు ప్రోత్సహించబడి, బలపడుచున్నవి - ఈ గొప్ప తరుణమును పోగొట్టుకొనవద్దు. అందరికి, అన్ని మతశాఖల వారికి, వారి బోధకులకు ప్రత్యేక ఆహ్వానము. ఉచిత భోజనం, వసతి ఏర్పాటు గలదు.

వివరములకు : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, పోస్టు బాక్సు నెం. 57, కాకినాడ 533 001

# సత్యవాక్య

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001.

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 | నవంబరు 1994 | సంచిక 4

## సంపాదకీయము

### మారుమనస్సు యొక్క ప్రయోజనము

### ( The Purpose of Repentance )

మారు మనస్సు అనగా నేమిటో, దాని ప్రయోజన మేమిటో గ్రహించని ప్రజలు నేడు కూడ అనేకులున్నారు. మారు మనస్సును గూర్చి లేఖనములు ఎంతో చెప్పుచున్నవి గనుక దానిని గూర్చి తెలిసికొనుటకు మనము లేఖనములను పరిశోధించుటయే ఉత్తమము.

మారుమనస్సు అనగా మనస్సు మార్చుకొనుట, జీవితాన్ని మార్చుకొనుట, ఒకని స్థితిని మార్చుకొనుట. అది పాపమునుండి మరలుట, పాపమును విసర్జించుట, ఇక పాపమును అభ్యసించకుండుట యగును. ఒక యజమానుడు తన కుమారుని తన ద్రాక్షతోటలోనికి వెళ్లి పనిచేయుమని చెప్పిన ఉదంతమును యేసు చెప్పెను. ఆకుమా

రుడు పోను అని ఉత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయి పనిచేసెను (మత్త 21:28). తరువాత పౌలు మారుమనస్సునుయొక్క ఒక మంచి నిర్వచనాన్ని యిచ్చాడు: "దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కర గలవానికి పంచిపెట్టుటకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచిపని చేయుచు కష్టపడవలెను." (ఎఫెసీ 4 : 28). నిజానికి ఒకడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించి, తన పాపములను విసర్జించడానికి నిశ్చయించుకొనినప్పుడు, యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనడానికి, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు అతడు సంసిద్ధుడై యుండును. అతడు క్రీస్తులోనికి బాప్తిస్మముపొంది ఒక నూతన స్థితిలో ప్రవేశించును, క్రీస్తు సంఘ సభ్యుడగును. మారుమనస్సు అంటే యిదే.

ఒకడు తన పాపముల నిమిత్తము మారుమనస్సు పొందితేనే గాని పాపములనుండి రక్షింపబడలేడు. పాపము మనలను దేవునినుండి వేరు చేయును. అది మరణమునకు దారితీయును (రోమా 6 : 23). పాపమును ఒప్పుకొనుట సిగ్గుకరము కాకూడదు. ఏలయనగా మనందరము పాపులమే, అయితే పాపమును మనం ఒప్పుకొనక, మారుమనస్సు పొందక యుండుట సిగ్గుకరము. కొందరు తమకు పాపము లేనట్లే ప్రవర్తిస్తారు. మేము మారుమనస్సు పొంద నక్కరలేదని తలుస్తారు. తాము పాపులమని అంగీకరిస్తే వారి గౌరవానికి భంగము కలుగునని కొందరు తలుస్తారు. అయితే మనం అంగీకరించినను, అంగీకరించక పోయినను, మనం పాపులమే. మనకు వివేచనయుంటే పాపము వలన వచ్చు జీతము మరణమని మనం గుర్తిస్తాము, మరియు దాన్ని గూర్చి మారుమనస్సు పొందుతాము. అంతే గర్వాంధులమై మన పాపాన్ని అంగీకరించక మరణ పాత్రులము కాకుందుము.

మనలో ఉన్న ఏమంచి సంగతిని విడిచిపెట్టుమని ప్రభువు

కోరలేదు. గాని ఏది చెడ్డదో దాన్ని విసర్జించమని చెప్పెను. మనం నైతికంగా మంచి జీవితాన్నే జీవిస్తున్నామని అనుకొనినను, మనం మారుమనస్సు పొందాల్సిన అవసరం ఉన్నది. మన మంచితనమే మనలను రక్షించు ననుకొంటే తప్పక మారుమనస్సు అవుసరం. మన పాపములనుండి మనం రక్షింపబడు నిమిత్తము ప్రభువు సిలువపై మర ణించాడు. మనం ఆయనకు విధేయత చూపినప్పుడే రక్షింప బడగలము.

అయితే క్రైస్తవుడయిన తరువాత యేమిటి? అప్పుడు కూడ మారుమనస్సు అవుసరమా? తప్పకుండా; గారడీ వాడైన సీమోను దేవుని శక్తిని డబ్బుతో కొనాలని ఎట్లు ప్రయత్నించాడో నీకు జ్ఞాపక మున్నదా? పేతురు అందువిషయమై అతని గద్దించి అతడు మారుమనస్సు పొందాలని ఆజ్ఞాపించాడు. తన కొరకు ప్రార్థించుమని సీమోను పేతురును అభ్యర్థించాడు. అతడు మారుమనస్సు పొందిన తరువాత మరల క్రైస్తవునివలె అంగీకరించబడెనని మనం తలంచ వచ్చును (అపొ. కా. 8 : 20-22). తరువాత లూకా 15వ అధ్యాయ ములో తప్పిపోయిన కుమారుని ఉదంతము మనకున్నది. అతడు తనకు వచ్చు ఆస్థిని తండ్రి యొద్దనుండి తీసికొని దూరదేశమునకు పోయి దానినంతటిని దుర్వ్యసనాలకు ఖర్చు చేసాడు. చివరకు అతడు పందు లను మేపుచు అవి తిను పొట్టుతో సహితము తన కడుపును నింపుకొన గోరెను. అయితే బుద్ధి వచ్చినప్పుడు అతడు లేచి తిరిగి తన తండ్రి యొద్దకు పోయెను. క్షమాపణ నడిగెను. తండ్రి అతని సంతోషముతో అంగీకరించెను. అందువలన యాకోబు ఇట్లు చెప్పుచున్నాడు: "మీ పాపములను ఒకనితో ఒకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థతపొందునట్లు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనః పూర్వకమైనదై బహుబలము గలదై యుండును" (యాకోబు 5:16). మనము దేవుని బిడ్డలమైనను మనము పాపులమే. మనం ఇష్టపూర్వక

ముగా పాపము చేయక పోవచ్చును గాని మనం పొరపాట్లు చేయుదుము. మనం అనరాని మాటలు ఆడతాము, చేయరాని సంగతులు చేస్తాము. చేయవలసినవి చేయకుండా ఉంచుతాము. మనం చెడుగు చేయాలని కాదుగాని, ఎంత జాగ్రత్తగా యున్నను తప్పు చేయకుండా యుండలేము. అందువలన మనం ఎల్లప్పుడు ప్రార్థించి క్షమాపణను కోరుట మంచిది. తన శిష్యులు ప్రార్థించాలని, "మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుమని" వారు ప్రార్థించాలని యేసు వారికి బోధించెను (మత్తయి 6:12).

అయితే బుద్ధి పూర్వకముగా పాపము చేయువాని సంగతి యేమిటి ? ఫలానా సంగతి తప్పు అని అతడెరిగిన తరువాత కూడ అతడా తప్పునే చేస్తాడు. అతడు బహుశ శోధింపబడి ఆ పని చేస్తాడు. తన కోపాన్ని అదుపు చేసికోలేక అనరాని మాటలాడతాడు. బుద్ధి పూర్వకంగా పాపము చేయుట ఎల్లవేళలా ప్రమాదమే. మరియు బుద్ధి పూర్వకముగా పాపము చేసి దాన్ని గూర్చి మారుమనస్సు పొందకపోవుట మరింత ప్రమాదము. గనుక ఒకడు మారుమనస్సు పొంది క్షమాపణకొరకు ప్రార్థనచేయాలి.

సంఘుసభ్యులు కూడ బహిరంగముగా పాపము చేసినప్పుడు బహిరంగముగానే తమ పాపముల నొప్పుకొని సంఘము యొక్క క్షమాపణ నడగాలి. ఇంతకు ముందుగ చెప్పిన రీతిగనే మనం ఎల్ల వేళలా ప్రభువును క్షమాపణ నడగాలి. అన్ని విషయములలోను ఆయనకు నమ్మకముగా యుండాలి. మనలను సిగ్గుపరచడానికి మారుమనస్సు పొందాలని ప్రభువు కోరుటలేదు గాని, మన ఆత్మలను ఏది నాశనము చేయునో దానిని, పరిత్యజించాలని ఆయన కోరుచున్నాడు. మనకేదైనా జబ్బు వస్తే మందులు వాడుటవలనగాని, ఆపరేషన్ చేయించుకొనుటవలన గాని దానినుండి బయటపడతాము.

శారీరకంగా మనం అంతజాగ్రత్త వహిస్తే, ఆత్మీయంగా మన ఆత్మలను నాశనము చేయు పాపము విషయమై మరి ఇంకెంత జాగ్రత్త పడాలి ? అందువలన మనము మారుమనస్సు పొంది జీవింతము.

—o—

## దేవుని కుటుంబము

### (The Family of God)

"కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు" (ఎఫెసీ 2 : 19).

దేవుని నుండి పొందిన ఆశీర్వాదములలో పదింటిని వ్రాయ వలసివచ్చిన యెడల అనేకులు వాటిలో ప్రథమముగా కుటుంబాన్ని గూర్చి వ్రాయుదురు. ఏదెను వనములో సృష్టింపబడిన నాటినుండి నేటి వరకు కుటుంబ వ్యవస్థద్వారా పలువిధములైన ఆశీర్వాదములను మానవులు పొందుచు యున్నారు. నిజానికి ఈ కుటుంబ వ్యవస్థను మనలను ప్రేమించు పరలోకపు తండ్రి మన కనుగ్రహించియున్నాడు.

కుటుంబముయొక్క ప్రాముఖ్యతను మనమెరిగిన తరువాత, క్రొత్త నిబంధన సంఘము ఒక కుటుంబముగా అలంకార రీతిగ చెప్ప బడుటలో ఆశ్చర్యము లేదు. కుటుంబము, యిల్లు అను మాటలు లేఖనములలో వాడబడినందున సంఘాన్ని దేవుని కుటుంబముగా మనము గుర్తించనగును. మనము క్రైస్తవులమైనప్పుడు దేవుని ఆత్మీయ కుటుంబమైన సంఘములోనికి జన్మించితిమి (యోహాను 3:5; ఎఫెసీ 2 : 19). ఇంకో మాటలో మనము క్రీస్తు సువార్తకు లోబడి ఆయన శరీరములో ప్రవేశించినప్పుడు దేవుడు మనలను తన పిల్లలుగా దత్తత చేసికొనును (ఎఫెసీ 1:5). క్రీస్తు ఈ లోకానికి వచ్చింది ప్రాముఖ్యముగా దీనికొరకే యని పౌలు సూచించాడు. "అయితే కాలము పరి

పూర్ణమైన నప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీ యందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడి యున్న వారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను" (గలతీ 4 : 4; 5).

## అవసరాలు

మానవులందరికీ కొన్ని సహజ అవసరా లుంటాయి. అవి భౌతిక కుటుంబములోనే తీరుతాయి. ఈ అవసరా లేమిటి? మనందరమూ ఎవరో ఒకరికి చెందినవారమనే భావన యుంటాది. అది మన మూలము. కుటుంబము సమాజములో మనకొక స్థిరత్వాన్ని యిస్తాది. రెండవదిగా మనకు భద్రత ముఖ్యము. మనము మానసికంగా గాని, భౌతికంగా గాని నిస్సహాయులమైతే మనలను ఆదుకొనేవారున్నారనే భద్రత మనకు ముఖ్యం. మన కుటుంబము ఈ భద్రతను మన కనుగ్రహిస్తాది. మనం పసిపిల్లలమై నప్పుడు కుటుంబం మనలను ఆదుకొంటాది. మనకు అనారోగ్యం వచ్చినా, నిట్టూర్పు కలిగినా కుటుంబం మనలను ఆదుకొంటాది. అట్లే మన వృద్ధాప్యంలో కూడా ఆదుకొనేది కుటుంబమే. మూడవదిగా మనకు గుర్తింపు అవసరము. మనమెవరమో, ఏమైయున్నామో యను సంగతులు తెలుసుకోడానికి సహజంగా కోరుకొంటాము. మన భౌతిక కుటుంబము ఈ వాంఛను తీర్చుటకు కొంత మట్టుకు ఉపయోగపడ్తాది. నాల్గవదిగా, మనం అంగీకరింపబడిన వారమనే గుర్తింపు పొందుటకు కాంక్షకలిగినవారము. మనమెట్లున్నామో, ఏమైయున్నామో అట్లే మన కుటుంబము మనలను అంగీకరిస్తాది. కుటుంబములో అంగీకరింపబడడానికి మనం దేనిని సాధించనవసరం లేదు. మనం గొప్ప సంగతులేమీ సాధించకపోయినా, తలంచకపోయినా సరే కుటుంబములో మన బంధువులు మనల్ని అంగీకరిస్తారు. మనం పొందే ప్రేమను కష్టపడి సంపాదించుకో నవసరం లేదు. బేషరతుగా ఆ ప్రేమ కుటుంబములో మనకు లభిస్తాది.

భౌతిక కుటుంబము తీర్చగల సాంఘిక, మానసిక, నైతిక అవసరతల వంటివే మానవులు ఆత్మీయకంగా కూడ కలిగియున్నారు. తమలో యున్న ఈ ఆత్మీయ అవసరాలను కొందరు గుర్తించ గలరు. కొందరు గుర్తించలేరు. మనం వాటిని గుర్తించినా, గుర్తించకపోయినా, ఈ లోకంలో యథార్థమైన సంతోషం కలిగియుండాలంటే ఈ ఆత్మీయ కోరికలు తీర్చబడాలి. మానవుడు ఆత్మీయ వ్యక్తిత్వముగలవాడు. ఈ ఆత్మీయ వాంఛలను నిర్లక్ష్యము చేసినా, అలక్ష్యము చేసినా, మనం ఒక రకమైన సాంఘిక సంతోషాన్ని అనుభవించవచ్చునేమో గాని, దేవుడు మన కొరకు సంకల్పించిన ఆత్మీయ సంతృప్తిని సంతోషాన్ని అనుభవించలేము. ప్రతి మానవునికి యున్న ఆత్మీయ అవసరాలు వాటికవే తొలగిపోవు. అట్టివేమీ లేవని భ్రమించినంతమాత్రాన అవి తీర్చబడవు. మనం భౌతికంగాను, ఆత్మీయకంగాను సంతోషాన్ని కలిగి యుండాలంటే, మన భౌతిక, ఆత్మీయ అవసరాలు తీర్చబడాలి.

## తీర్చబడిన అవసరాలు

మనందరికీ యున్న ఆత్మీయావసరాలను మరియొక కుటుంబము, దేవుని కుటుంబము తీర్చుచున్నది. ఈ ఆత్మీయ కుటుంబములో దేవుడు తండ్రియై యున్నాడు (1 యోహాను 3:1), క్రైస్తవులు సోదర సోదరీలై యున్నారు (1 యోహాను 5:1), మరియు యేసు క్రీస్తు జ్యేష్ఠ సోదరుడై యున్నాడు (రోమా 8 : 17). ఈ పరలోక కుటుంబాన్ని పౌలు 'సంఘము' అని పిలిచాడు. పౌలు తిమోతికి ఇట్లు వ్రాసాడు: "శీఘ్రముగా నీ యొద్దకు వత్తునని నిరీక్షించుచున్నాను. అయినను నేను ఆలస్యము చేసినయెడల దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను. ఆ

సంఘము సత్యమునకు స్థంభమును ఆధారమునై యున్నది" (1 తిమో 3 : 14-15).

క్రొత్త నిబంధన సంఘములో క్రైస్తవుడు నేనూ ఒకరికి చెందిన వాడననే అనుభవాన్ని కలిగి యుంటాడు. తాను ప్రార్థించడానికి ఒక పరలోక తండ్రి యున్నాడు. ఆయనతో అతడు నడుస్తాడు, జీవిస్తాడు. తన కొరకు పెద్ద అన్న ఒకరున్నారు. ఆయన ద్వారా ప్రార్థించడానికి, ఆయననుండి నేర్చుకోడానికి, ఆయనపై ఆధారపడడానికి ఆయన యున్నారు. ఒండొరులను సోదర సోదరీలుగ భావించే సమాజంలో అతడు భాగస్వామియై యుంటాడు. వారందరు ఒక సంస్థవలెగాక ఒండొరులను ప్రేమిస్తు, పనిచేస్తు ఆత్మీయ కుటుంబముగా వ్యవహరిస్తారు.

దేవుని కుటుంబములో మనకు ఆత్మీయ భద్రత యున్నది. మన పరలోకపు తండ్రి మనలను ప్రేమించుచున్నాడని, మనకు కావలసినవి అనుగ్రహిస్తాడని మనం ఎరుగుదుము. ఆయన మన భౌతిక అవుసరాలను కూడ తీరుస్తాడు. దేవుడు మనకేమి కావలెనో ఎరిగియున్నాడని, వాటిని ఆయన తీరుస్తాడని అందువలన మనం చింతించ నవుసరంలేదని యేసు ప్రభువు బోధించారు. "కాబట్టి ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వాటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును" (మత్తయి 6:31, 32). అట్లే మన తండ్రి మన ఆత్మీయావసరాలను తీర్చగలడు. "తొట్రిల్లకుండ మిమ్ము కాపాడుటకును, తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువబెట్టుటకును" మన దేవునికి శక్తి యున్నదని యూదా వ్రాసాడు (యూదా : 24).

దేవుని కుటుంబమైన సంఘములో ఆత్మీయ గుర్తింపు కొరకైన

మన వాంఛకూడ తీర్చబడుచున్నది. క్రీస్తులోనికి రాకముందు ఏవిధమైన తామతలంపు లేకుండా అటు యిటు తిరుగుచు యుండేవారం. అయితే దేవుని కుటుంబములో జన్మించుట ద్వారా మనం దేవుని స్వంత సొత్తుగా చేయబడినవారము. ఈ మార్పును గూర్చి పేతురు ఇట్లు వ్రాసాడు: "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు, ఒకప్పుడు ప్రజగా ఉండక యిప్పుడు దేవుని ప్రజయైతిరి; ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడిన వారైతిరి" (1 పేతురు 2:9, 10). దేవుని కుటుంబాన్ని పౌలు దేవుని స్వాస్థ్యమనికూడ వర్ణించాడు (ఎఫెసీ 1:18). దేవుని కుటుంబముగా క్రైస్తవులకు నిత్య స్వాస్థ్యము, పరలోకమున్నది. దేవుడుకూడ క్రైస్తవులను తన స్వాస్థ్యముగా కలిగియున్నాడు.

అదేవిధంగా దేవుని కుటుంబము మనకు ఆత్మీయ ఆమోదము ననుగ్రహించుచున్నది. మన విశ్వాసమునకు విధేయత చూపుచు దేవుని యొద్దకు మనం వస్తే, మనలను ఆయన తన బిడ్డలుగా అంగీకరించును. ఆయన తన ప్రత్యేక ప్రేమను మన కనుగ్రహిస్తాడు; మన హృదయాల్లో తన ఆత్మను ఉంచుతాడు. తద్వారా "అబ్బా, తండ్రీ యని" మొరపెట్ట గలుగుచున్నాము (గలతీ 4:6). "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసు నందున్నవారికి ఏ శిక్షావిధియు లేదని" పౌలుతో మనము కూడ చెప్పగలము (రోమా 8:1). అట్లయితే మారు మనస్సు, ఆత్మీయ పెరుగుదల అవుసరము లేదని దీని యర్థము కాదు,గాని మనమున్న చోటునసే ఆయన మనలను అంగీకరించి, మనం వుండవలసిన చోటుకు ఆయన కొనిపోవునని దీని యర్థము.

మనం ఉన్నలాగుననే ఆయన మనలను ప్రేమిస్తాడు; గాని ఆయన మనలను ఎంత ప్రేమించుచున్నాడంటే అదే స్థానంలో మనలను ఆయన వదిలేయడని ఒకాయన చెప్పాడు.

క్రీస్తు సంఘము మన ఆత్మీయావుసరాలను ఎట్లు తీర్చుచున్నదో అనేకులు గ్రహించుకోలేరు. వారు క్రొత్త నిబంధన సంఘము నెరిగినవారు వారుకారు, సంఘాన్ని దేవుని కుటుంబముగా, వారెన్నడు పరిగణించి యుండలేదు. అందువలన వారు క్రొత్తనిబంధన సంఘమునకు వెలుపల యుంటూ తాము పొగొట్టుకొనుచున్న దానిని గూర్చి ఆలోచన లేక యున్నారు. సంఘమనగా యేమిటో, దేవుని కుటుంబముగా అది వారి ఆత్మీయ అవుసరాలను ఎట్లు తీర్చగలదో అట్టివారికి తెలియ జెప్పే బాధ్యతను ప్రతి క్రైస్తవుడు కలిగి యున్నాడు. దేవుని కుటుంబము ద్వారానే మనము శాంతిని, భద్రతను, లక్ష్యాన్ని, ప్రయోజనమును, గుర్తింపును మనం పొందగలము. సంఘమనే ఈ కుటుంబానికి వెలుపల మనం నిజమైన సంతోషమును పొందలేము.

## చక్కగా తీర్చబడిన అవుసరాలు

సంఘాన్ని దేవుని కుటుంబముగా పర్యావలోకనం చేస్తూ మొదటి శతాబ్దములోయున్న సంఘాన్ని గూర్చి లూకా వ్రాసిన వివరణను పర్యవేక్షించుదాం. ఆదిమ క్రైస్తవుల దైనందిన జీవితాల్లో దేవుని కుటుంబము యొక్క విశిష్ట లక్షణాలను అతడు చక్కగా వివరించాడు: "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి... విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చరస్థిరాస్థులను అమ్మి, అందరికిని వారివారి అక్కర కొలది పంచిపెట్టిరి. మరియు వారేక మనస్కులై ప్రతి దినము దేవాలయములో తప్పక కూడు

కొనుచు ఇంటింట రొట్టె విరుచుచు, దేవుని స్తుతించుచు ప్రజలందరి వలన దయ పొందిన వారై ఆనందముతోను, నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను" (అపో.కా. 2 : 42-47).

ప్రతి క్రైస్తవుడు తాను మరొకనికి చెందిన వానిననే అనుభవం కలిగియుండెను. ఏలయనగా విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగిన దంతయు సమిష్టిగా ఉంచుకొనిరి (అపో. కా. 2:44). ప్రతిక్రైస్తవుడు గుర్తింపు పొందినవాడే ఏలయనగా ఒకనిపై మరొకడు ఎన్నడు ఘనుడుగా ఎంచబడలేదు. మరియు ఆపదలలో యున్నవాని అవుసరాలను తీర్చుటకు సంఘమంతయుసమిష్టిగా కృషి చేసిరి. ప్రతివాడు ఆమోదము నొందినవాడే, దినదినము ప్రజలు ప్రభువు సంఘముతో చేర్చబడుచుండేవారు, సంఘమంతా వారిని సంతోషముతో స్వీకరించే వారు, ప్రతి సభ్యునికి సమిష్టి జీవనములో యున్నట్టి భద్రత అనుగ్రహింపబడినది, వారు తమ చరస్థిరాస్థులను అమ్మి అందరికిని వారివారి అక్కర కొలది పంచిపెట్టిరి.

దేవుని కుటుంబమైన ఈ సంఘము క్రమముగా ఆరాధన చేసే వారు. వారు ప్రార్థన, బోధన, సహవాసము, ప్రభురాత్రి భోజనము, కానుకలు యిస్తు దేవుని ఆరాధించేవారు (అపో.కా. 2 : 42). యేసు క్రీస్తు ద్వారా అనుగ్రహింపబడిన కృపను బట్టి వారు దేవుని కొనియాడేవారు. వారు ఆనందముతోను, నిష్కపటమైన హృదయముతోను జీవిస్తూ యుండేవారు. సంఘములోయున్న సమిష్టి జీవితమును బట్టి భద్రతను, ఈ లోకంలో ఆదరణను రాబోవు లోకములో క్రీస్తు ద్వారా కలుగు నిత్యజీవిత నిరీక్షణను వారు కలిగియుండిరి. యిది దేవుని కుటుంబములో యున్న గొప్ప దీవెన.

## ముగింపు

నీవు దేవుని కుటుంబ సభ్యుడవు కాగోరుచున్నావా? దేవుని కుటుంబమైన సంఘములో ప్రవేశించే వరకు నీ జీవితము పరిపూర్ణము కాదని నీవెరుగుదువా? ఆయన కుటుంబమునకు వెలుపల యుంటే నీవు ఆత్మీయ స్థిరత్వాన్ని, భద్రతను, ఆమోదాన్ని, గుర్తింపును లేకుండా యుంటావు. వీటిని ఆయన కుటుంబము మాత్రమే నీకీయ గలదు.

ప్రతి బాలుడు, బాలిక అనాధలైపోతామేమో యనే భయాన్ని కలిగి యుంటారు. అనాధులను చూచుసరికి వయసు వచ్చినవారి హృదయం కరగిపోతాది. ఎవడును అనాధగా యుండాలని కోరుకోడు, అనాధలను చూడాలని ఎవరు కాంక్షించరుకూడ. మానవుల అక్రమాల వలన లేదా జీవితంలో సంభవించే ఘోర పరిస్థితులవలన కొందరు అనాధలవుతారు. దీన్ని మనం ఆపుచేయలేము. అయితే అట్టి అనాధల యెడల ప్రేమను, దయను కలిగి సహాయాన్ని మనం అందించగలము. అయితే ఆత్మీయంగా ఎవడు అనాధగా యుండనవు సరంలేదు. సువార్తద్వారా ఎవరైనను సరే దేవుని కుటుంబములో సభ్యుడు కాగలడు, ఆయన బిడ్డగా దత్తత చేయబడగలడు మరియు మిగిలినవారందరివలె దేవుని ప్రేమను కుమారత్వాన్ని పొందగలడు.

ఆత్మీయ జన్మద్వారా మనం దేవుని కుటుంబములో ప్రవేశిస్తాము. యేసు ఇట్లనెను: "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5). దేవుని వాక్యము ద్వారా క్రీస్తునందు విశ్వసించునట్లును (యోహాను 8 : 24), మారు మనస్సు పొందునట్లును (అపొ.కా. 17:30), క్రీస్తులోనికి బాప్తిస్మము పొందునట్లును ఆత్మ మనలను నడిపించును (1 కొరింథీ 12 : 13).

పేతురు ఇట్లనుచున్నాడు: "మీరు క్షయ బీజమునుండి కాక, శాశ్వతమగు జీవితముగల దేవుని వాక్య మూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడినవారు" (1 పేతురు 1 : 23). ఆత్మ మూలముగాను ఉనీటి మూలముగాను జన్మించిన వారిని దేవుడు తన పిల్లలుగా స్వీకరించును. వారికి ఆయన తన ఆత్మ ననుగ్రహించును (గలతీ 4 : 6). తన కుటుంబముయొక్క దీవెనల ననుగ్రహించును (ఎఫెసీ 1:3) మరియు వారికి నిత్య స్వాస్థ్యము నిచ్చును (ఎఫెసీ 1 : 11). తత్ఫలితముగా దేవుని పిల్లలు దేవునికి చెందినవారమనే భద్రతను, ఆమోదమును, గుర్తింపును పొంది జీవింతురు. నీవు దేవుని బిడ్డవా?

—ఎడ్డీ క్లోర్ (TFT)

— o —

కొండమీద ప్రసంగము-3

## మీరు లోకమునకు ఉప్పయి యున్నారు

### (Ye are the Salt of the Earth)

( మత్తయి 5 : 13-16 )

యేసుప్రభువు ఈ లోకములో యున్నప్పుడు జనసమూహములు ఆయన చుట్టు గుమిగూడేవారు. ఆయన జనసమూహములను చూచి కొండయెక్కి చేసిన గంభీరమైన బోధలను మనం గమనించుచు యున్నాము. ఆయన కొండ మీద చేసిన ప్రసంగ సారాంశము మత్తయి సువార్త 5, 6, 7 అధ్యాయాల్లో మనకొరకు వ్రాయబడి యున్నది. అనేక ఆత్మీయ సత్యాలను ఆయన చెబుతు తన శిష్యుల నుద్దేశించి యిట్లు బోధించారు :

"మీరు లోకమునకు ఉప్పయి యున్నారు. ఉప్పు నిస్సారమైతే అదిదేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మను

ష్యుల చేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు. మీరు లోకమునకు వెలుగైయున్నారు; కొండ మీద నుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి మంచము క్రింద పెట్టరుగాని అది యింటనుండు వారందరికి వెలుగిచ్చుటకై దీపస్థంభము మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు, వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి" (మత్తయి 5 : 13-16).

మీరు లోకమునకు ఉప్పయి యున్నారని యేసు చెప్పిన మాటలను ఇప్పుడు మన పాఠ్యభాగంగా గమనించుదాం. యేసుక్రీస్తు శిష్యులు ఈలోకమునకు ఉప్పయి యున్నారను మాటనుండి మనం అనేక పాఠాలను నేర్చుకోవచ్చును. సాధారణంగా ఈ లోకంలో మనకు చవుకగాను, విరివిగాను దొరికేది ఉప్పే. ఉప్పుకున్న విలువను, దాని ప్రయోజనాలలో కొన్నింటిని మనం చూస్తే క్రైస్తవుడు ఈ లోకానికి ఉప్పువంటివాడెట్లు అవుతాడో తెలిసికోగలం.

## ఉప్పు విలువ

ఉప్పు కొన్ని పదార్థాలను చెడిపోకుండ, కుళ్లిపోకుండ భద్ర పరుస్తాది. రిఫ్రిజిరేటర్లు మొదలైనవి లేకముందు మాంసము, చేపలు మొదలైనవి ఉప్పులో యుంచి భద్రపరచేవారు. మన దేశంలో ఇప్ప టికి కూడ ఉప్పుపెట్టి ఎండబెట్టిన చేపలు బజారులో లభిస్తాయి. ఇలాగ ఉప్పుపెట్టిన పదార్థముల నది కుళ్లిపోకుండ భద్రపరుస్తాది. రక్షిస్తాది. సముద్రములోని ఉప్పుకూడ దానిలోని జీవులు పాడవకుండా రక్షిస్తాది.

క్రైస్తవులు ఈలోకానికి ఉప్పయి యున్నారు. వారు ఈలో కంలో యుంటూ దానికి కుళ్లు పట్టకుండా, అది చెడిపోకుండా కాపాడే శక్తి గలవారని యేసు యొక్క భావం. క్రైస్తవులు, క్రైస్తవులయొక్క ప్రభావము ఉన్నచోట, అవినీతికి, అక్రమాలకు, కలహాలకు తావుం

డదు. నేడు మన దేశంలో ప్రబలియున్న అవినీతికి, అక్రమాలకు, కలహాలకు, విరుగుడు క్రీస్తు సువార్త యనే ఉప్పు మాత్రమే. ఈ సువార్తను వెదజల్లువారు క్రైస్తవులై యున్నారు. ఎక్కడైతే నిజదేవుని నెరిగి ఆయనను సేవించువారుందరో అక్కడ సమాజము ప్రశాంతముగా యుండును. ఎక్కడైతే అట్టివారుండరో అక్కడ సమాజము కుళ్లు పట్టినదై యుండును.

నోవహు కాలంనాటి లోకంలో దుర్మార్గత బహుగా విస్తరించింది. "నరుల చెడు తనము భూమి మీద గొప్పదనియు వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు చెడ్డదనియు యెహోవా కనుగొనెను" (ఆది. 6). ఆనాటి లోకానికి కుళ్లు పట్టకుండా చేయడానికి దైవభక్తి యనే ఉప్పు సరిపడినంతగా లేకపోయెను. తత్ఫలితంగా నోవహు, అతని కుటుంబమును తప్ప మిగిలిన వారందరినీ గొప్ప జలప్రళయం ద్వారా దేవుడు నాశన మొనర్చాడు (ఆది. కా. 6 అధ్యా).

సొదొమ గొమొఱ్ఱాల సంగతి కూడ అంతే. సొదొమ పట్టణంలో కనీస మాత్రపు ఉప్పువంటి మనుష్యులు, దైవ భక్తి నీతి కలిగిన వారుంటే దేవుడు ఆ పట్టణాన్ని నాశనము చేయకుండును. సొదొమ యొక్క పాపము బహు భారమైనది గనుక యెహోవా దేవుడు దాన్ని నాశనం చేసేసాడు. ఆపట్టణంలో ఏబదిమంది నీతిమంతులున్న యెడల ఆస్థలమును నాశనం చేయుదువా అని అబ్రాహాము దేవుని నడిగాడు. "యెహోవా-సొదొమ పట్టణములో ఏబదిమంది నీతిమంతులు నాకు కనబడిన యెడల వారిని బట్టి ఆస్థలమును కాయుదుననెను". ఆ పట్టణములో 45 మంది ఉంటే నాశనము చేతువా అని అబ్రాహాము అడుగగా, ఆ 45 మందిని గూర్చి నాశనము చేయనని ప్రభువు చెప్పెను. ఆ పట్టణములో 30 మంది, లేక 20

మంది, లేక కనీసం 10 మంది నీతిమంతులుంటే దానిని నాశనం చేయనని ప్రభువు అబ్రాహాముకు చెప్పాడు. దేవుడు సొదొమ పట్టణాన్ని నాశనం చేసాడంటే దానిలో ఆ కనీస మాత్రపు నీతిమంతులు కనబడ లేదన్న మాట. ఉప్పువంటి వారి ప్రభావము ఆ పట్టణములో కొరతవైనందున దానికి పాపం అనే కుళ్లు పట్టినది. చివరకు పాపమువలన కలుగు జీతం మరణం అయ్యింది.

ఈనాడు ప్రతి పట్టణంలోను పల్లెలోను జీవించుచున్న క్రైస్తవులు తమలోయున్న క్రీస్తు ప్రభావమును ప్రజలకు కనబరచాలి. వారు ఈ లోకానికి ప్రయోజనకారులు, ఉప్పువంటివారని ప్రజలు తెలిసికోవాలి. అందుకే "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ సత్క్రియలను ప్రకాశింపనీయుడి" యని యేసుప్రభువు బోధించారు. "దైవభక్తి యిప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజన కరమగును" అని అపొ. పౌలు చెప్పాడు (1 తిమో 4 : 8).

## సూక్ష్మ జీవుల నాశనం

ఉప్పులోయున్న మరియొక లక్షణం - అది సూక్ష్మ జీవులను, క్రిములను చంపుతుంది. ఈ క్రిములు మనకంటికి కనపడవు గాని వాటిని మనం గమనించకుండా యుంటే అవి మనల్నే హాని మారుస్తాయి. అయితే కొంచెం ఉప్పు కలిగిన ద్రవకాన్ని వాటిపై ఉపయోగిస్తే అవి చస్తాయి. అట్లే పాపం అనేది మనలో ఒక సూక్ష్మ జీవిలా ప్రవేశిస్తాది. దాన్ని మనం వెంటనే చంపకపోతే మనల్ని అదే మరణానికి నడిపిస్తాది. అందువలన ఉప్పువంటి ప్రభావం కలిగిన క్రైస్తవులు ఈ లోకంలో పాపాన్ని హతమార్చడానికి ఎల్లప్పుడు ప్రయ

త్నిస్తూ యుండాలి. ఈ లోకంలో ఉప్పువంటి ప్రభావం మనం కలిగి యుండకముందు మనలోయున్న పాపాన్ని ముందుగా సువార్త శక్తి వలన హతమార్చాలి.

## రుచి కలుగజేస్తాది

ఉప్పులో యున్న ఇంకొక లక్షణం యేమంటే అది రుచిని కలుగజేస్తాది. ఏదైనా పదార్థములో ఉప్పు లేకపోయినా, లేక తక్కువైనా మనం వెంటనే దాన్ని గమనించగలం. ఒక గృహిణి మంచి పదార్థాలను, కూరలను తయారుచేసి వాటిలో ఉప్పు వేయడం మరచి పోతే, ఆ కూరలకు, పదార్థాలకు రుచి యేమియు ఉండదు కదా. ఆమె కష్టపడి తయారుచేసిన కూరను రుచి చూచినవారు దానిలో ఉప్పు లేదని వెంటనే తెలియజేస్తారు. ఉప్పు వేయగానే ఆ కూరకు రుచి వస్తాది. అట్లే ఈ లోకానికి ఆత్మీయ ఉప్పు కొంత అవుసరం. అందుకే యేసుప్రభువు తన శిష్యులను చూచి, "మీరు లోకమునకు ఉప్పు అయియున్నారు" అని చెప్పారు. క్రైస్తవులు క్రైస్తవ ప్రభావములేని ప్రదేశము ఉప్పలేని కూరవలె చప్పగా యుంటాది. క్రైస్తవ జీవితానికి సారాన్ని రుచిని కలుగజేసేది క్రీస్తు సువార్తయే. అందు వలన అది సర్వలోకానికి ప్రకటింపబడాలని యేసుప్రభువు ఆజ్ఞాపించారు (మార్కు 16:15, 16).

క్రైస్తవులు ఈ లోకానికి ఉప్పయి యున్నారు. "ప్రతి మనుష్యునికి ఏలాగు ప్రత్యుత్తర మీయవలెనో అది మీరు తెలిసికొనుటకై మీ సంభాషణ ఉప్పువేసినట్లు ఎల్లప్పుడు రుచిగలదిగాను, కృపా సహితముగాను ఉండనియ్యుడి" యని పౌలు చెప్పుచున్నాడు (కొల 4 : 6).

ఉప్పు దాహమును కలుగజేస్తాది. దీన్ని మనందరం యెరిగినదే. మనం నీతికొరకు ఆకలి దప్పులు కలిగి యుండాలని యేసుప్రభువు బోధించారు (మత్త 5:6). అట్లే యేసు యిచ్చు జీవజలములనుగూర్చి

మనం తృష్ణ కలిగి యుండాలి. అవి మనకు దొరికినప్పుడు మరెన్నడు దాహం గొనము (యోహాను 4:13, 14).

ఉప్పు నిస్సారమైతే అది దేనివలనసారముపొందును? అని యేసు ప్రభువు ప్రశ్నించారు. క్రైస్తవుడు తనలోని క్రీస్తు ప్రభావాన్ని కోల్పోతే ఈ లోకంలో ఎందుకు పనికిరాడు. అనేకులు క్రైస్తవుల మని చెప్పుకొంటారు గాని వారి జీవితాలయితే నిస్సారమైనవే; వారు కేవలం నిప్పులులు.

నిస్సారమైన ఉప్పు బయట పారవేయబడి మనుష్యులచే త్రొక్కబడును. నిస్సారమైన పనికి మాలిన క్రైస్తవుడు వెలుపటి చీకటిలోనికి త్రోసి వేయబడును. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 25 : 30).

నీవు యేసు ప్రభువునందు విశ్వాసముంచుము. నీపాపముల విషయమై మారుమనస్సు పొందుము. పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందు. నీలో చోటు చేసుకొన్న పాపాన్ని క్రీస్తు రక్తము ద్వారా అంతమొందించు. క్రీస్తు కొరకు ఈ లోకంలో సారవంతమైన జీవితం జీవించు ! !

— జాషువా గూటం.

— o —

## మనము కాదనలేవి సత్యము

( గత పంచిక తరువాయి )

—జాన్ S. ఫ్రెడరిక్, పెద్దాపురం.

యేసుప్రభువువారిలో స్వార్థము ఏ మాత్రము కన్పించదు. ఆయన రోమన్ గవర్నరు ఎదుట నిలిచి, "సత్యము నిమిత్తము సాక్ష్యమిచ్చుటకై నేను పుట్టితిని" అని అన్నారు. మానవుడు మంటితో

చేయబడినవాడు. ఆ పాపియైన మానవుని రక్షించుటకు యేసుప్రభువు వారు ఆ మన్నును (మట్టిని) కప్పుకొనుటకు సంకోచించలేదు. 33½ సంవత్సరములు మనుష్యలోకములో సంచరించినారు. "పాపులను పిలువవచ్చితిని గాని, నీతిమంతులను పిలువరాలేదని," ఆయన పెదవులతో సాక్ష్యమిచ్చుచున్నారు. ఆ ప్రభువువారు చనిపోయి, సమాధి చేయబడి, మూడవ దినమున లేచి మానవ లోకమునకు కనబర్చుకొన్నారు ఆయన సమాధిలోనుండి లేచి మనుష్య లోకములో ఒక రోజు, రెండురోజులు కాదు, నలువది దినముల వరకు తన్ను తాను అగపర్చుకొన్నట్లు పరిశుద్ధుడైన లూకా యీలాగు వ్రాయుచున్నాడు: "ఆయన శ్రమపడిన తరువాత నలువది దినములవరకు వారికి అగపడుచు దేవుని రాజ్య విషయములనుగూర్చి బోధించుచు ఆయన సజీవుడుగా వున్నారని ఋజువు పరచుకొన్నారు". మానవ ప్రపంచములో ఇంత స్పష్టముగా ఋజువు పరుచుకొన్న దైవము ఎవరును లేరు. ఆయన చేసిన అద్భుతములు ఎవ్వరు చెయ్యలేరు. ఉదాహరణకు :-"పుట్టు గుడ్డివాని కన్ను లెవరైనా తెరిచినట్లు లోకము పుట్టినప్పటినుండి వినబడలేదని" ఆ గుడ్డివాడే కన్నులతో సాక్ష్యమిచ్చుచున్నాడు.

## పరమ వైద్యులు

సముద్రము గొప్ప అలలతో నిండియుండును. ఆ సముద్రముపై శాంతముగా నడిచిన దేవుడు యేసుప్రభువు ఒక్కరే! చనిపోయి, పాతిపెట్టబడి, నాలుగు దినములు కుళ్ళిపోయిన శవమును సమాధినుండి "బయటికి రమ్ము" అని చెప్పగానే ఆ శవము సజీవముగా లేచి నడచుటను, చుట్టునున్న మనుష్యులు చూచి విభ్రాంతి నొందడం మానవ లోకములో ఎక్కడ, ఎన్నడు మనము చూడలేదు, చూడబోము. మృతులైనవారిని "చిన్నవాడా లెమ్ము, చిన్నదానా లెమ్ము" అని

నోటి మాటలతో, సజీవులునుగా లేపిన దైవమును ఇన్ని వేల సంవత్స రముల నుండి మానవలోకము చూచి యెరుగదు. కుష్ఠురోగులను, వారి కుష్ఠు పుండులను మనము అసహ్యించుకొందుము. బస్సులలోగాని, రైళ్ళలోగాని వారి చెంతవుండి ప్రయాణము చేయుట మనము ఒప్పు కొనము - ఐతే ఈ దేవుడు, అనగా ప్రభువైన యేసువారు, కుష్ఠురోగి యొద్దకు పోయి, ఆయన చేతులతో ఆ కుష్ఠు పుండు ముట్టుకొని, "నాకిష్టమే, నీవు శుద్ధుడవు కమ్మని" బాగుచేసినట్లు మానవలోకములో మునుపు ఎక్కడా చూడలేదు.

యేసుప్రభువువారు నీ కన్నీరు, నా కన్నీరు; నీ దుఃఖము నా దుఃఖము పంచుకొనుటకు పరలోకమునుండి దిగివచ్చినారు. మానవ లోకము పాపిష్టిలోకమై నశించిపోవుట యిష్టములేక విలపించినట్లు సాక్ష్యములు బైబిలులో చదువరులు చూడగలరు. ప్రభువువారు సర్వజ్ఞానులని ఈ క్రింది ఋజువులద్వారా తెలిసికొనగలము. సముద్ర ములో కోట్లాది చేపలు గలవు. ఏ చేప నోటిలో ఏమున్నదో ఆయనకే తెలియును. ప్రభువువారు ఆయన శిష్యుడైన పేతురుకు నీవు సముద్ర ములో గాలము వేసి, దొరికిన మొట్టమొదటి చేపను పట్టుకొని దాని నోరు తెరచి దాని నోటనున్న నాణెమును తీసికొని రమ్మని సెలవిచ్చినారు.

## జాలిగల తండ్రి

ప్రభువువారు అఖండమైన జాలిగల తండ్రిలు. మూడు దిన ములనుండి ఆకలితో నున్నను, ఆకలి మరచి ఆయన మాటలు విన్న నాలుగు వేలమందిని చూచినప్పుడు ఆయన జాలిపడ్డారు. మార్గములో మూర్ఛపోయి పడిపోవుదురని ఆ నాలుగువేల మందిని ఆకలితో వెళ్ళ నీయలేదు. ఇది దైవ ప్రేమ. మన దేశములో ఎన్నో వైద్యశాలలు, ఎందరో డాక్టర్లు వున్నారు. యేసుప్రభువువారి దినములలో ఇన్ని

వైద్యశాలలు లేవు. ఇంతమంది డాక్టర్లు లేరు. యేసుక్రీస్తు ప్రభువు వారు ఒక్కరే పరమ వైద్యులుగా నిరూపించుకున్నారు. మాటతో కుంటివారిని, మాటతో గుడ్డివారిని, మాటతో రోగపీడితులైన వారెవ రైనను బాగుచేసిన దైవము యేసుప్రభువువారు ఒక్కరే. పొంగు చున్న సముద్రముతో, భయంకరముగా వీచుచున్న తుఫానుగాలితో, "సముద్రమా నిమ్మళించు" అని చెప్పి ఆ మహా సముద్రమును నిమ్మళింపజేసి, ఆ గాలిని సద్దణగ చేయుట మన జీవితకాలములో ఎక్కడ, ఎన్నడు చూచి ఎరుగముగదా? ఆయన నీ దురవస్థను చూచి ఊరుకొనే దైవము కాదు. దేవుడు పరలోకములో వుండి నా దురవస్థను చూడక, నా మొర్రలను వినకపోతే, ఆ దైవముతో నా కెటువంటి సంబంధము వుండదు, ఎటువంటి సంబంధము పెట్టుకొనను. అయితే "నా ప్రజల దురవస్థను నేను నిదానించి చూచితిని. వారి మొర్రలు వింటిని, వారిని విడిపించుటకు దిగివచ్చితిని" అని పలికిన దేవుడే మానవునికి అవసరం.

యేసు అనగా తన ప్రజలను వారి పాపములనుండి రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పరలోకమునుండి ఒక దూత ద్వారా ఆ పేరు పంపబడెను. యేసుక్రీస్తువారి కాలములో రోగులు విస్తారముగా ఉండేవారు. ఆసుపత్రులు లేకుండా వుండుటచేత, రోగులు సమూహముగా యేసుప్రభువువారి యొద్దకు వచ్చుచుండెడివారు. ప్రభువే వారికి ఆశ్రయము. కావున వారు వేలకు వేలుగా యేసు ప్రభువు చుట్టూ మూగుచుండెడివారు. ఆ దినములలో యాజక వర్గము వారు అంగీలు ధరించుకొని, సంత వీధులలో వందనములను, సమాజ మందిరములలో అగ్రపీఠములను, విందులలో అగ్రస్థానములను కోరు చుండెడివారు. దీర్ఘ ప్రార్థనలు చేయుచుండెడివారు. కాని వారు రోగులను యేసుప్రభువువారి వలె ఒక్క మాటలో స్వస్థపరచేవారు

కాదు. ప్రభువైతే ఒక్క మాటతో కుంటి వానికి కాళ్లు, గుడ్డివానికి కన్నులు యిచ్చి, ఒక్క మాటతో కుష్ఠురోగిని స్వస్థపరచి, ఒక్క మాటతో కుళ్ళిన శవమును బ్రతికించి, చనిపోయిన వారిని ఒక్క మాటతో లేపిన దైవము. ఐదు రొట్టెలను ఐదు వేలమంది ఆకలి తీర్చుటకు పంచియిచ్చిన ప్రభువు.

## అసూయ కుట్ర

ఇవన్నియు ఆ దినములలో యాజక వర్గముగాని, శాస్త్రుల వర్గముగాని చేయలేకపోవుటవలన, సదరు వర్గములవారికి యేసుక్రీస్తు ప్రభువువారి యెడల మిక్కుటమైన అసూయకు ప్రధానకారణమై, ప్రధాన సమస్యగా నిలిచిపోయినది. అందుచేత సదరు వర్గమువారు యేసుప్రభువువారిని లేకుండా చేయుట ఒక్కటే మార్గమని నిశ్చయతకు వచ్చినారు. యేసుక్రీస్తు ప్రభువువారిని చంపుటకు ఇది ప్రధాన కారణము. వేలకొలది సమూహములు యేసును వెంబడించుచుండగా వారితోపాటు, ఈ కుట్రదారులు తప్పులు పట్టుకొనుటకు, మాటలతో చిక్కులు కలిగించుటకు తాపత్రయ పడేవారు. ప్రభువుయొక్క పన్నెండుమంది శిష్యులలో ఒకడు తనవద్ద దాచియుంచిన డబ్బును దొంగతనముగా వాడుకొనుట, ఆ ధనాపేక్షతో ఏ దుష్కార్యము నైనా సందేహించకుండా చేయుటకు సంసిద్ధత చూపించెను. వాని పేరు ఇస్కరియోతు యూదా. ఈ యూదా వారు చేయుచున్న కుట్రకు దోహదము కల్పించుటకు ధనము ఆశించియున్నాడు. ప్రభువును అప్పగించినయెడల యాజక వర్గమువారు తనకేమి యిత్తురోనని రహస్యముగా బేరమాడినాడు. అప్పటినుండి యేసుప్రభువువారిని ఒంటరిగా అప్పగించుటకు, కిద్రోను వాగు దగ్గరనున్న ఒలీవకొండ ప్రభువు ఏకాంత ప్రార్థనలకు ఏకాంత స్థలమని యూదాకు తెలిసియుండెను. పస్కా దినమున యేసుప్రభువువారును, ఆయన శిష్యులును పస్కాను ఆచరించి, అది చివరి దినమని ఆయన అప్పగింపబడు దినమని

ఆయనకు తెలిసియుండి ఒలీవ కొండమీద ప్రార్థన చేయుటకు శిష్యులతో వెళ్ళెను. ఆయనను ఏ విధముగా యూదులు పట్టుకొని చంపుదురో యేసుక్రీస్తుకు ముందుగానే తెలియును.

ఆ రాత్రి యూదా ప్రభువును చంపుటకు యూదులు పంపిన జనముతోను, కత్తులతోను, గుదియలతోను, వెలుగుచున్న కాగడాలతోను బయలుదేరెను. అతడు నేను ఎవరిని ముద్దుపెట్టుకొందునో ఆయనే యేసు అని గుర్తుచెప్పియున్నాడు. యేసుప్రభువువారి వేదనతో ఆయన చెమట రక్తబిందువులుగా మారి ఆ రక్తబిందువులతో అంగీ నానిపోయినది. ఆయన ప్రార్థన చాలించి లేచినప్పుడు, ఇస్కరియోతు యూదా, ఆయనను బంధించుటకు వచ్చిన జనమునకు ముందుగా పోయి క్రీస్తు ప్రభువువారిని ముద్దు పెట్టుకొన్నాడు. ఆ గుర్తు ప్రకారముగా ఆయనే యేసుక్రీస్తని తెలిసికొని ఆయనను పట్టుకొని వెంటనే బంధించారు. ప్రభువువారి శిష్యులను పోనిచ్చినారు. బంధించిన యేసు ప్రభువును కొండమీదనుండి యీడ్చుకొనుచు పోయినారు. ఇది ప్రభువుయొక్క శ్రమకు ప్రారంభము. వారు యీడ్చుకొనుచు పోయి ప్రధాన యాజకునియొద్దకు తీసికొని వెళ్ళి ప్రభువును నిలువబెట్టినారు. ప్రధాన యాజకుడగు కయప "నీవు దేవుని కుమారుడవగు క్రీస్తువు అయితే మాతో చెప్పుము" అని అనగా, అందుకు ప్రభువైన యేసు "నీవు అన్నట్టే, ఇది మొదలుకొని సర్వశక్తుని కుడిపార్శ్వమున ఆయన కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురు" అని చెప్పగా ప్రధాన యాజకుడు "వీడు దేవదూషణ చేసెను, ఇదియే సాక్ష్యము. ఇక మనకు సాక్షులతో పనియేమి? మీకేమి తోచుచున్నది?" అని అడిగెను. అందుకు సభలోనివారు వీడు మరణమునకు పాత్రుడని చెప్పిరి. "ప్రధాన యాజకునితో ఈ విధముగా మాట్లాడుచున్నావా?" అని ప్రభువును చెంపమీద కొట్టినారు.

ఆయన ముఖముపై. ముసుగువేసి బలముగా గుద్ది అపహాసించినారు. తరువాత ప్రభువు ముఖముపై ఉమ్ములు వేసినారు. ప్రధాన యాజ కుని యొద్దనుండి ప్రభువును వాచిన ముఖముతో రోమా గవర్నరగు పిలాతు ఆవరణలోనికి తీసికొనిపోయినారు. ప్రభువు ముఖముమీద ఆ సభవారు వూసిన ఉమ్మి చెంపలమీద యింకా కారుచునే యున్నది. ప్రభువువారు బంధింపబడిన చేతులతో గవర్నరు ఎదుట నిలువబడినారు. ఆ నిలువబడిన స్థలముపేరు ప్రితోరియం (హాలు). యేసుప్రభువు పిలాతు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పుచూ, "నేను రాజునే; సత్యమునుగూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; యిందు నిమిత్తమే ఈ లోకములోనికి వచ్చితిని" అని నుడివినారు. ఆ జనులు ప్రభువు గలతీయుడని చెప్పగా హేరోదు రాజు పరిపాలనలో వున్న వాడని, పిలాతు హేరోదు నొద్దకు పంపినాడు. యేసుప్రభువారు హేరోదు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పకుండ మౌనముదాల్చుట చూచి, ఆయనను అపహాసించి ప్రశస్త వస్త్రము ధరింపజేసి పిలాతు నొద్దకు పంపించినాడు. పిలాతు ప్రభువును తీసికొనివచ్చిన సమూహా ముతో "యిదిగో ఈ మనుష్యుడు ఈయనయందు నాకు ఏ నేరము కన్పించలేదు" అని గట్టి స్వరముతో ప్రకటింపగా; "సిలువ వేయుము, సిలువ వేయుము" అని యాజకవర్గమంతా ప్రజలచేత కేకలు వేయించి నారు. క్రీస్తు అనబడిన యేసును నేనేమి చేతునని గవర్నరు అడుగగా సిలువ వేయుము, సిలువ వేయుము అని బిగ్గరగా కేకలు వేయించినారు. ఆ సమయములో గవర్నరు భార్య ఆ నీతిమంతుని జోలికి పోవద్దని కబురు పంపించినది. అయినను వారు - సిలువ వేయుమని బిగ్గరగా వేసిన కేకలే పిలాతు సమ్మతింపవలసివచ్చెను. "తీసికొనిపోయి మీరే సిలువ వేయుడని" తీర్మానము ప్రకటించగా వారు సైనికుల స్తోమ మంతటిని పోగుచేసి ప్రభువును "ప్రితోరియం" అను హాలులో సిలువబెట్టిరి.

[సశేషం

# సంక్షిప్త వార్తలు

1994 అక్టోబరు 11 మరియు 12 తారీఖులలో క్రీస్తు సంఘ బోధకుల సదస్సు రెండు రోజుల పాటు అత్యంత ఘనముగా కాకినాడలో జరిగెను. దీనిలో ఇంచుమించు రెండు వందలమంది బోధకులు పాల్గొనిరి. అనేకులు పలు ప్రాంతముల నుండి తరలివచ్చినా సోదరులు రోజర్ డిక్సన్‌గారు అందరికంటె ఎక్కువ దూరము నుండి ఈ సదస్సు నిమిత్తమై ప్రత్యేకముగా వచ్చిరి. ఆయన కేప్‌టౌన్, దక్షిణాఫ్రికా నుండి వచ్చిరి. ఆఫ్రికా సంఘము నుండి వచ్చి భారతదేశపు క్రీస్తు సంఘ పనిలో పాల్గొనిన ప్రప్రథమ సోదరుడు రోజర్ డిక్సన్‌గారు.

సదస్సు నిమిత్తమై రెండు ప్రాముఖ్యమైన చర్చనీయాంశములు ఈయబడెను. వాటిపై సోదరులు బూల మోహనుగారు, యు. స్టాలిన్ గారు, పాల్ గూటంగారు కొంతమట్టుకు తమ సందేశముల నిచ్చిరి. అయినను బైబిలులో మహా విద్వాంసులైన సోదరులు డిక్సన్‌గారికి సోదరు లందరు ఎక్కువ సమయం కేటాయించుమని కోరగా అట్లు జరిగెను. ఆ రెండు దినాలలోను రోజర్ డిక్సన్‌గారు గంభీరముగా దేవుని వాక్యమును ప్రకటించిరి. అపొస్తలుల కార్యముల గ్రంథము యొక్క ముఖ్యోద్దేశమును గూర్చి, పౌలు, సీల, తిమోతి, లూకా యొక్క సువార్త పనిని గూర్చి, దైవత్వము, సంఘారాధనలను గూర్చి మునుపెన్నడును వినని రీతిగా ఆయన బోధించి, అనేక విషయాలపై సోదరుల అభిప్రాయములను తారుమారు చేసారు. మానవులు కల్పించుకొనిన దేవుండ్లు తమతమ ప్రాంతములకు, సంస్కృతికి మాత్రమే పరిమితమైన వారని, యేసుక్రీస్తు ఒక్కడే సర్వమానవాళికి దేవుడని ఆయన ప్రకటించారు. మరియు 21వ శతాబ్దపు ఆరంభానికి ఆఫ్రికాగాని, ఇండియాగాని క్రైస్తవ్యముయొక్క కేంద్రస్థానము కాగలదని, అమెరికా ఎంతమాత్రము కాజాలదని ఆయన పేర్కొన్నారు. మరియు ఆఫ్రికా ఖండమంతయు వేలకొలది క్రీస్తు సంఘము లున్నాయని, వారందరు క్రీస్తుకొరకు నిరంతర కృషి సల్పుచున్నారని తెలియజేసారు.

అక్టోబరు 13వ తేదీ గురువారం ఆయన రామచంద్రపురంలోని Bro. M. ఆల్‌ఫ్రెడ్‌గారి గృహంలోను, జగన్నాథగిరిలో Bro. పి. ప్రకాశంగారి వద్దను గడిపి, వాక్యపరిచర్య చేసి 14వ తేదీన బయలుదేరి దక్షిణాఫ్రికా చేరుకొన్నారు.

అక్టోబరు 14వ తేదీ సాయంకాలం Bro. నెహెమ్యా కూటం గారి జ్యేష్ఠ కుమారుడు ఆండ్రూ యొక్క వివాహము అత్యంత ఘనంగా జరిగినది. వందలాది పురప్రముఖులు, బంధువులు; మిత్రులు, సోదరులు హాజరై ఈ సంతోష కార్యములో పాల్గొనిరి.

ఈ పత్రిక ముద్రించు సరికి నవంబరు మొదటి వారంలో ఢిల్లీ వెళ్ళుటకు సోదరులు జాషువా కూటంగారు ఆయత్తమవుచున్నారు. 1994 డిశంబరులో జరిగే సెమినార్ తరువాత 1995 జనవరిలో బోధకుల సదస్సు జరుగును.

— 0 —

Regd. No. H/KD—45/KD H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..........................................
..........................................
..........................................
..........................................